'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దు

- అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికుల సంఘం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు నందికి తాతారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1536వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సుమారు 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఇప్పటికే విధుల నుంచి తొలగించారని, మరో 2500 మందిని తొలగించేందుకు యాజమాన్యం కుట్రలు చేస్తోందని అన్నారు. మూడు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ కార్మికులు శాశ్వత ఉద్యోగులతో కలిసి పని చేస్తూ పరిశ్రమ అభివృద్ధికి, ఉత్పత్తి పెరుగుదలకు శాయశక్తులా కృషి చేశారని తెలిపారు. అలాంటి వారికి కనీస గౌరవం ఇవ్వడంలేదని పైగా తొలగించడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరీక్షల పేరిట కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యలను ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు

- మే 20న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి
- కార్మిక సదస్సులో వక్తల పిలుపు

సదస్సులో అభివాదం చేస్తున్న సిహెచ్.నర్సింగరావు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని పలువురు వక్తలు అన్నారు. దేశవ్యాప్తంగా మోడీ సర్కారు అనుసరిస్తోన్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ మే 20న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో దాని జయప్రదం కోసం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సదస్సు జరిగింది. అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాజశేఖర్, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని తెలిపారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును, యాజమాన్యంతో జీతభత్యాలు బేరం ఆడుకోనే హక్కును కోల్పోతారన్నారు. యజమానికి నచ్చితే ఉద్యోగం, నచ్చకపోతే తొలగించే విధంగా చట్టాల్లో మార్పు తీసుకొచ్చారని తెలిపారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, సామాజిక భద్రత, పెన్షన్ సౌకర్యం వంటివన్నీ కోల్పోతారన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని తెలిపారు. మే 20న జరిగే సమ్మెను బలపరుస్తూ గ్రామీణ ప్రాంతంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు హర్తాళ్‌కు పిలుపునిచ్చాయన్నారు. సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. సదస్సుకు అధ్యక్షవర్గంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు వ్యవహరించారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కెఎం.శ్రీనివాస్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి, ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, సిఎఫ్‌టియుఐ నాయకురాలు కె.లక్ష్మి హాజరయ్యారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మే 20న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సదస్సు ప్రారంభంలో ఇటీవల కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, మౌనం పాటించారు.

మున్సిపల్ ఉద్యోగులకు పిఆర్‌సి ప్రకటించాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉద్యోగులకు వెంటనే 12వ పిఆర్‌సి ప్రకటించాలని, ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకుని, ఆయా ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేయడంలేదని విమర్శించారు. 12వ పిఆర్‌సి కాలపరిమితి ముగిసి రెండేళ్లవుతున్నా నేటికీ పిఆర్‌సి కమిటీ నియమించలేదని, ఐఆర్ ప్రకటించలేదన్నారు. ఆప్కాస్ ఉద్యోగులను కాంట్రాక్టర్లకు, ప్రయివేటు ఏజెన్సీలకు కట్టబెట్టే ఆలోచన విరమించుకోవాలని కోరారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల 17 రోజుల సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలని, దహన సంస్కారాల ఖర్చులు రూ.20 వేలకు పెంచాలని, వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, ఎక్స్‌గ్రేషియా రూ.ఏడు లక్షలకు పెంచాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలనే ప్రధానమైన సమస్యన్నీ నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఇప్పటికే మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఆందోళనలు నిర్వహించామని, మంత్రులకు రాయబారాలు నడిపామని తెలిపారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రభుత్వ వైఖరి ఈ విధంగా ఉంటే రానున్న కాలంలో రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకైనా మున్సిపల్ కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిఐటియు ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు బి సోమయ్య మాట్లాడుతూ ఎనిమిది గంటల పని దినాన్ని రక్షించుకోవాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దు చేయొద్దని కోరుతూ మే 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు కూడా పాల్గొంటారని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు బి బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎ జానుబాబు, జంగారెడ్డిగూడెం నగర అధ్యక్షులు ఆర్ నాగరాజు, ఏలూరు నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు పాల్గొన్నారు.


రూ.1.50 కోట్లు చెక్కును టిటిడి అదనపు ఈవోకి అందిస్తున్న దాతలు

ఎస్‌వి ప్రాణదాన ట్రస్టుకు రూ.2 కోట్లు విరాళం

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల ఎస్‌వి ప్రాణదాన ట్రస్టుకు ఆదివారం రూ. రెండు కోట్లు విరాళం వచ్చింది. శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1.50 కోట్లు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల విరాళంగా ప్రకటించింది. ఈ మేరకు తిరుమలలోని టిటిడి అదనపు ఇఒ క్యాంపు కార్యాలయంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి ఆ సంస్థ జోనల్ హెడ్ కె ధారాసింగ్ నాయక్, రీజనల్ హెడ్ ఇ వెంకటేశ్వర్లు విరాళం చెక్కును అందజేశారు. శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు చెన్నయ్‌కు చెందిన పొన్ ప్యూర్ కెమికల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ రూ.50 లక్షలు విరాళంగా అందించింది.

మేడే స్ఫూర్తితో ఉక్కు పరిరక్షణ పోరాటం ఉధృతం

- సిపిఎం కార్పొరేటర్ గంగారావు
- స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం 'మేడే మార్చ్'

మేడే మార్చ్‌లో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

మేడే స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేయాలని జివిఎంసి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల్లో భాగంగా ఉక్కు నగరం త్రిష్ణ గ్రౌండ్ నుంచి సెక్టార్ 3, 2, 1, 5, 6 మీదుగా 'మేడే మార్చ్' పేరుతో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిష్ణ గ్రౌండ్ వద్ద గంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్రం అనుసరిస్తోన్న ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఉక్కు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. నేడు స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి పెరుగుతున్నా కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. కార్మికులకు న్యాయంగా చెల్లించాల్సిన హెచ్ఆర్ఎకు కోత పెట్టడం, కరెంటు ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కేంద్రీయ విద్యాలయం, విమల విద్యాలయం వంటి విద్యా సంస్థలను మూసివేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పిల్లలకు విద్యను అందించాల్సిన బాధ్యత నుండి వైదొలగడం శోచనీయమన్నారు. కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు కార్మికుల సమస్యలపై ఈ నెల 28న ఉక్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, స్టీల్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు టి.చిరంజీవి, సిఐటియు నాయకులు పుల్లారావు, వి.ప్రసాద్, మొహిద్దిన్, పృథ్వీ, వల్లి, దుర్గాప్రసాద్, గౌరీ శంకర్, మధు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, రాజు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఒవి.రావు, కెపి.సుబ్రహ్మణ్యం, ఉక్కునగరం చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

ఆగస్టు 20 నుంచి 24 వరకు ఒంగోలులో సిపిఐ రాష్ట్ర మహాసభలు : కె రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సిపిఐ రాష్ట్ర 28వ మహాసభ ఆగస్టు 20 నుంచి 24 వరకు ఒంగోలులో నిర్వహించేందుకు ఆ పార్టీ రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం సిపిఐ రాష్ట్ర 28వ మహాసభల ఆహ్వాన కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో. రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ శత జయంతి సందర్భంగా మహాసభకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు .'పోరాటాల పురిటి గడ్డ' గా పేరొందిన 'ప్రకాశం వామపక్ష ఉద్యమం'లో రాష్ట్రానికి అత్యధిక రాష్ట్ర నాయకత్వాన్ని అందించిన చరిత్ర ఉందన్నారు. నల్లూరి వెంకటేశ్వర్లు నాయకత్వంలో పార్టీ వంద సంవత్సరాల వేడుకలను తొలిసారి ఒంగోలులో సిపిఐ రాష్ట్ర 28వ మహాసభ నిర్వహించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

పాడుదమా స్వేచ్ఛాగీతం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి, డివిజి శంకరరావు, మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

'గురజాడ'ను విస్మరించడం తగదు

- 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాకవి గురజాడ వెంకట అప్పారావును రాష్ట్ర ప్రభుత్వం అవమానించిందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రుల మనోభావాలను కూడా ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. పాడుదమా స్వేచ్ఛాగీతం.... ఎగరేయుదమా జాతి పతాకం.. అంటూ సగటు పౌరుడి గుండెలను హత్తుకునే పాటను పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చెందిన గంటేడ గౌరునాయుడు రాసిన సంగతి తెలిసిందే. ఆయన రాసిన పాటల పుస్తకాన్ని సాహితీ స్రవంతి కార్యదర్శి చీకటి దివాకర్ ఆధ్వర్యాన నడిచే చీకటి ప్రచురణలు వెలుగుల కోసం అనే ప్రచురణ సంస్థ ద్వారా ముద్రించారు. ఈ పుస్తకాన్ని విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పలువురి ప్రముఖులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలకపల్లి రవి, అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించాల్సిన ప్రముఖుల జయంతులు, వర్ధంతుల జాబితాలో గురజాడ పేరు లేకపోవడం సరికాదన్నారు. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్.. అంటూ దేశాన్ని పాలించుకోవాలో, అభివృద్ధి చేయాలో స్వాతంత్ర్యోద్యమానికి ముందే చెప్పిన దార్శనికుడు గురజాడని కొనియాడారు. గురజాడతోపాటు తెలుగు భాష వికాసానికి ఎంతో కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు, సామాజిక మార్పు కోసం కృషి చేసిన కందుకూరి, గుర్రం జాషువా వంటి మహనీయుల పేర్లు కూడా ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. రామాయణం రాసిన మొల్ల తప్ప మహిళా ప్రముఖులకు కూడా ప్రాధాన్యత దక్కలేదని వివరించారు. సనాతన ధర్మాన్ని సవాలు చేస్తూ, కుల, మతాలను ప్రశ్నిస్తూ గురజాడ అనేక రచనలు చేశారని, అందువల్లే ఆయన పేరు పక్కనబెట్టారని విమర్శించారు.

గురజాడ గేయానికి కొనసాగింపే స్వేచ్ఛాగీతం : ఎంవిఎస్ శర్మ

దేశమంటే మట్టికాదోయ్... అంటూ గురజాడ రచించిన దేశభక్తి గేయానికి గంటేడ గౌరునాయుడు రాసిన పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట కొనసాగింపేనని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. నాడు తెల్లదొరలు పాలించిన మన దేశంపై అమెరికన్ సామ్రాజ్యవాదులు పెత్తనం చెలాయిస్తున్నారని వివరించారు. నాటి జాతీయోద్యమ స్ఫూర్తిని దెబ్బతీయడానికి పాలకపార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. అందుకే గురజాడ వంటివారికి గుర్తింపు లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలకు జాతీయోద్యమ చరిత్ర తెలియాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఇందుకు పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట ఎంతో తోడ్పాటునందిస్తుందని తెలిపారు. ప్రజా గాయకులు ఇటువంటి గీతాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, కవులు, కళాకారులు కూడా మరిన్ని దేశభక్తి గేయాలను అందించాలని ఆకాంక్షించారు.

పుస్తక రూపంలో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలి : డాక్టర్ డివిజి శంకరరావు

గంటేడ గౌరునాయుడు రాసిన కవితా సంకలనాలను పుస్తక రూపంలో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల తాను కర్నూలు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు విద్యార్థుల నుంచి పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట వినిపించినప్పుడు ఎంతో ఆనందం కలిగిందని చెప్పారు. శ్రామికులు, రైతులకు, బాలల కోసం గౌరునాయుడు రాసిన రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, ప్రముఖ వైద్యులు జి.సన్యాసమ్మ పాల్గొన్నారు. గౌరునాయుడు రచించిన అనేక పాటలను గాయనీ, గాయకులు ఆలపించారు. కవులు, రచయితలు గౌరునాయుడు రచనలపై చర్చించారు.

అటవీ భూములు అదానీకి అప్పగించొద్దు

- మారిక గ్రామ సదస్సులో తీర్మానం

ప్రజాశక్తి - వేపాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా వేపాడ మండల పరిధిలోని మారిక గ్రామ భూములను అదానీ కంపెనీకి అప్పగించొద్దని సిపిఎం సదస్సులో గిరిజనులు తీర్మానించారు. మారిక గ్రామంలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఎం మండల నాయకులు చల్లా జగన్ మాట్లాడారు. మారిక రెవెన్యూలో 35 సర్వే నంబర్లు ఉంటే మొత్తం 32 సర్వే నంబర్లలో ఉన్న భూములు, ఇళ్లు, బడి, గుడితోపాటు గ్రామం చుట్టూ ఉన్న అటవీ భూములు, కొండలు అదానీ గ్రూపునకు చెందిన హైడ్రో పవర్ ప్లాంటుకి అప్పగిస్తామని చెప్పడం అన్యాయమన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అదానిపై ఉన్న ప్రేమ గిరిజనులపై లేకపోవడం దారుణమన్నారు. మారిక గ్రామ భూముల్లో అదాని హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లాలోని మొత్తం గిరిజనులను ఐక్యం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, అదానీ కంపెనీని మారికలో అడుగు పెట్టకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించాలని సదస్సులో తీర్మానించారు. ప్రాణాలైనా ఇస్తాం కాని గ్రామాన్ని మాత్రం వదలబోమని గిరిజనులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి పెంటమ్మ, జలారి వీరరాజు, పాలి సోమేశ్ కుమార్, గెమ్మెల బాబురావు, కిల్లో ఆనంద్, రామకృష్ణ, గెమ్మెల అప్పలనాయుడు, బొబ్బిలి గణేష్, వెంకటరావు, శ్రీను, ఆశుకృష్ణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అదానీకి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని నినాదాలు చేస్తున్న గిరిజనులు

నేడు కోకో రైతుల చలో గుంటూరు

- అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలి
- ఎపి కోకో రైతుల సంఘం

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటించాలని కోరుతూ ఈ నెల 28న సోమవారం కోకో రైతుల చలో గుంటూరు-ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా విజయరాయిలోని గాంధీనగర్ కోకో తోటలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘ సమావేశం ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్ మాట్లాడుతూ చలో గుంటూరు-ధర్నా కార్యక్రమాన్ని కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 75 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ అంతర పంటగా కోకోను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అదనంగా ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు నేడు సిండికేట్‌గా మారి కోకో రైతులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.750కు పైగా ధర ఉందని, ప్రస్తుతం కంపెనీలు రూ.450 నుండి రూ.500 మాత్రమే ఇస్తున్నాయని చెప్పారు. కంపెనీలు చెప్పిన ధర కంటే ట్రేడర్లు ఇంకా తక్కువకు కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఈ నెల 3న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్ర సచివాలయంలో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కోకో రైతులు, కోకో గింజల కొనుగోలు కంపెనీలతో సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. ఈ సమావేశం నిర్ణయం ప్రకారం ఈ నెల 7న కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటన చేయాల్సి ఉండగా ఇంతవరకు ప్రకటించకపోవడంతో కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, ఫలితంగా కోకో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలకు ధర కల్పించి కోకో రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు, నాయకులు నాగరాజు శ్రీనివాసరాజు, కె రామి రెడ్డి, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదు కార్యాలయం చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్‌సుల బిజినెస్ పార్క్, గనపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400013.
శాఖ చిరునామా : డో.నం: 54-15-4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లెరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యూజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ-520008

స్థిరాస్తి యొక్క విక్రయం కొరకు నోటీసు
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు రూల్ 9(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 30 రోజుల ఇ-వేలం నోటీసు

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్ఎఫ్ఎల్)కి తనఖాగా ఉంచబడిన స్థిరాస్తిని క్రింద వివరించిన స్థిరాస్తిని గురించి సాధారణ ప్రజలుకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత లేదా వారి చట్టపరమైన వారసులు/ప్రతినిధులు (రుణగ్రహీతలు)లకు దీని ద్వారా నోటీసు ఇవ్వడింది. టిసిహెచ్ఎఫ్ఎల్ యొక్క ఆధీకృత అధికారి తీసుకున్న స్వాధీనం 29.05.2025న దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతలు బకాయిలను రికవరీ చేయడానికి **"ఎక్కడ ఉందో అలాగే ఉంది" మరియు "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది" ఆధారంగా.** రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ దిగువన పేర్కొనబడ్డాయి. ఏదైనా వాయిదా/విక్రయాలు నిలిపివేయబడినప్పుడు, పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్/ఆస్తి దీని ద్వారా విక్రయించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. **ఇ -వేలం 29.05.2025న మ. 2గం.లకు . ఇ-వేలంల